అమ్మమ్మ కథ

మా శంభుగాడూ తలోదరీ వాళ్ళ అమ్మమ్మను కథ చెప్పమని వేధించటం నాకు వినిపించింది.

ఈ ఒక్క ముక్కా వివరించటానికి కొన్ని విషయాలు చెప్పాలి.

మా అత్తగారు మాతోటే ఉంటున్నది. ఆవిడ కిద్దరు కూతుళ్ళు. నా భార్య చిన్నది. మా వదినెగారిని పోవూరిచ్చారు. అయితే వాళ్ళు పోవూర్లో ఉండడం లేదు. బొంబాయిలో ఉంటున్నారు. నా షడ్డకుడికి రెక్కాడితేకాని డొక్కాడదు. అందులో కూడా రెక్కాడటం జాస్తీ డొక్కాడటం కాస్త తక్కువాను. పెళ్ళినాటికి అతనికి కాస్త పొలమూ పుట్రా ఉండేది. పెళ్ళయాక ఆ కాస్తా హరించుకు పోయింది. మా వదినెగారి పాదం నిప్పాదమని అత్తవారు విసుక్కున్నారు. దరిద్రుణ్ణి చేసుకున్నదని మా అత్తగారు కూడా పెద్ద కూతురిపైన చిరాకు పడి తనకున్న నాలుగెకరాల "పసుపూ కుంకుమా" తో సహా మా దగ్గిరికి వచ్చేసింది. లేనివాడి కెవరిస్తారు? మొగుడుపోయిన ఆవిడకి తన "పసుపు కుంకుమ" పొలంతో రుణం తీరిపోయినట్టయి, దాన్ని ఏ కూతురి కిద్దామని, ఎరిగిన వాళ్ళందరితోనూ సంప్రదించి ఆలోచన చేసింది. ఇద్దరికి చెరి సగం ఇవ్వమని చాలామంది సలహా ఇచ్చారు. అంత ధర్మబద్ధంగా పనిచేసి అనామకురాలిగా ఉండటం "ఆస్తి"గల ఏ ఆడదాని కిష్టమవుతుంది గనకా?

తల్లికోసం మా వదినెగారు మహా తహతహ లాడింది. మొగుడు తెచ్చే మూడు వందలతో వాళ్ళ సంసారం ఏ మాత్రమూ సుఖంగా జరగటంలేదు. అందులో వంద పైచిలుకు ఇంటి అద్దెకూ కరెంటుకూ పోనేపోతుంది.

కొందరి అదృష్టం అలా ఉంటుంది. యుద్ధానికి ముందు మా షడ్డకుడు బెజవాడ రైసు మిల్లులో పనిచేశాడు. అప్పుడూ అతని జీతం చాలీ చాలకుండానే అఘోరించింది. ఇట్లా కాదని మద్రాసులో ఒక ఉద్యోగం సంపాదించుకుని అక్కడికి మకాం మార్చాడు. పధ్నాలుగు మాసాల వ్యవధిలో మా వదినెగారు ఇద్దరు పిల్లల్ని కని ఆ జీతం రాళ్ళు చాలీ చాలకుండా చేసింది.

తరువాత ఈ బొంబాయి ఉద్యోగమూ, మరి ముగ్గురు పిల్లలూ దారిద్ర్యమూ –

మా షడ్డకుడి అదృష్టంలో ఏమీ మార్పులేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా, మా షడ్డకుడు ఆరో పిల్ల కూడా పుట్టాక ఆపరేషను చేయించుకొని ఫామిలీ ప్లానింగు అనబడే కుటుంబ నియంత్రణ అమలు జరిపాడు.

చెప్పొచ్చిందేమిటంటే, తన తల్లి తాలూకు నాలుగెకరాలూ తన పేరే పెట్టించేసుకుందామని మా వదినెగారు భగీరథ ప్రయత్నం చేసింది.

"దాని దురాశ చూశావుటేవ్?" అన్నది మా అత్తగారు మా ఆవిడతో.

"ఒక చెంప జరగకచస్తుంటే దురాశ అంటావేమిటి?" అని మా ఆవిడ తల్లిని కోప్పడింది. తెలుగు వాళ్ళకు దుఃశ్శబ్దం చాలా ఇష్టం. శాలువాను దుశ్శాలువ అన్నట్టే ఆశను దురాశ అంటారు. అభిమానాన్ని దురభిమానమంటారు.

"అయితే ఆ కాస్తా దానికిచ్చేసి నీ నోటా నీ పిల్లల నోటా కరక్కాయ కొట్టనా?" అన్నది మా అత్తగారు. అంత దురన్యాయం, ఆలోచిస్తేనే తనకు కంపరంగా ఉన్నట్టు.

మా ఆవిడ, తల్లి మీద విసుక్కుని, "నీ పొలం లేకపోతే మేం కరక్కాయలు తినలేం. ఆ ముష్టి పొలాన్ని పట్టుకుని ఊరేగక దానికిచ్చేసి నిశ్చింతగా కూర్చో" అన్నది.

"అయితే నీకక్కర్లేదంటావ్?" అన్నది మా అత్తగారు బెదిరింపుగా.

"వద్దు."

"నిజంగా వొద్దా?"

"వద్దు మొర్రో అంటుంటిని కాదుటమ్మా?"

అంటే తన ఆస్తిని మా ఆవిడకే ఇవ్వాలని మా అత్తగారు నిర్ధారణ చేసింది.

నాకు మామూలు మనుషుల మనస్తత్వమే అర్థం కాదు. డిటెక్టివు నవల ప్లాటు లాంటి మా అత్తగారి మనస్తత్వం ఏమర్థమవుతుంది? దేహీ అని అడగని వాళ్ళే ఎక్కువ పాత్రత గలవాళ్ళని ఆవిడ ఉద్దేశమేమో. లేకపోతే తన చిన్న కూతురికి తన మీద గురి తక్కువగా ఉన్నట్టు గ్రహించి, మరింత గౌరవం సంపాదించగలందులకు తన పొలాన్ని ఇవ్వాలని నిశ్చయించిందేమో. పెద్ద కూతురు - ఆ నాలుగెకరాల కోసమేకావచ్చు గాక - తల్లిని దేవుడల్లే చూసింది. అలా చూసే ఆవిడ తల్లికి లోకువయిందేమో నాకు తెలీదు.

మా ఆవిడకు నాలో నమ్మకం లేక ముందుగానే హెచ్చరించింది:

"మా అమ్మ మీతో చెబుతుంది. తన ఆస్తి నా పేర పెట్టబోతున్నానని. మీరు ఎగిరి చంకలు గుద్దుకోక గుంభనగా ఉండండి. ఆస్తి నీ పేర పెడతానే అంటుంది గాని, అది నా పేర పెట్టడమూ కాదు, పాడూ కాదు. ఆ పొలం మీద ఏటా ఆరేడు వందలు వస్తాయి. వాటిని తెచ్చి నా ఒళ్ళో పోసి తానువచ్చి నా నెత్తిన ఎక్కి కూర్చొంటుంది. ఈవిణ్ణి ఎట్లా వదిలించుకోవాలో నాకు తోచటం లేదు."

"పెద్దది వచ్చి మన దగ్గిర ఉంటాననంటే వద్దంటామా. డబ్బియ్యకపోయినా ఉంచుకోవచ్చునే!" అన్నాను.

"ఆవిడ రాకుండా ఉంటే ఎదురు డబ్బిస్తాను. మీకేం, చెబుతారు? అత్తగారని మీకు మోజైతే నా కేమీ లేదు" అన్నది మా ఆవిడ.

చెప్పు ఎక్కడ కరిచేదీ తొడుక్కున్నవాడికే తెలుస్తుందని నేనూ ఒప్పుకుంటాను. మా అత్తగారు నా నరాల మీదికేనాడు రాలేదు. కాని మా ఆవిడ మాత్రం తన తల్లితో అంత బాగా వేగలేని మాట నిజం. మా అత్తగారు రెండే రెండు మాటలు అనేసరికి మా ఆవిడకు ఊపిరి అందకపోవటమూ, కళ్ళు మెరవటమూ, గొంతు కీచుపోవటమూ నేను కళ్ళారా చూసి నేను రహస్యంగా మందలించాను కూడా.

"ఆవిడ మీద నీకేదో శత్రుత్వం. ఉత్త పుణ్యానికెందుకట్లా ఆయాసపడి పోతావు? ఆవిడ ఏమన్నదని?" అన్నాను.

"మీకు తెలీకపోతే ఊరుకోండి. ఆవిడ మనస్సులకు తొడపాశం పెడుతుంది" అన్నది మా ఆవిడ. మనస్సుకు తొడపాశం పెట్టటమనేది నేను మా ఆవిడ నోటే విన్నాను.

మా ఆవిడ కూడా భగీరథ ప్రయత్నమే చేసింది తల్లిని దూరంగా ఉంచటానికి. మా అత్తగారు సామాన్యురాలు కాదు. ఇద్దరు కూతుళ్ల భగీరథ ప్రయత్నాలనూ వ్యర్థం చేసి మా ఇంటికి వచ్చేసింది.

"నువ్వు మీ అమ్మను రెండు చేతులూ చాచి ఆహ్వానించి ఉంటే ఆవిడ రాకపోనేమో" అన్నాను.

"ఈ మాట ముందు చెప్పకపోయారా, ఇన్నాళ్లూ ఏం చేస్తున్నారు?" అన్నది మా ఆవిడ.

మా షడ్డకుడి కుటుంబ నియంత్రణలాగే నా సలహా కూడా గత జలసేతు బంధనమయింది.

❀ ❀ ❀ ❀ ❀

మా ఆవిడ ఓడిపోయినా, నేననుకున్నా, మా అత్తగారు గెలిచాననుకున్నట్టు కనపడలేదు. ఆవిడ మనస్తత్వంలో నాకు కనిపించిన తిరుగుడు అదే. మరొకరైతే విజయగర్వంతో తృప్తిపడేవారు. కాని ఆవిడ మటుకు మధ్య మధ్య మా ఆవిడకు పరీక్ష పెట్టేది. "పాపం, అది ఆ బొంబాయిలో ఆ దరిద్రుడితో ఏం అగచాట్లు పడుతోందో, దాన్ని చూడాలనిపిస్తుందే" అనేది.

వెంటనే మా ఆవిడ "వెళ్ళాలని ఉందనకపోతే వెళ్ళి చూసి రారాదూ, ఇక్కడ రైలెక్కి అక్కడ దిగటమేగా?" అనేది.

"రైలైతే మాత్రం దూరభారం కాకుండా పోతుందా? పైగా, అదేం పట్నం, అవేం కార్లు! ఒకసారి వెళ్లాగా? ఏ క్షణాన ఏ కారు మీదిగా పోతుందోనని భయపడి చచ్చాననుకో."

"నీకు అక్క మీద అంత జాలి ఉంటే ఒక ఏడాది అయివేలు దానికి పంపరాదూ?" అన్నది మా ఆవిడ ఒకసారి.

మా అత్తగారు అంకిళ్లు నొక్కుకుని, "మీ మీదపడి తింటూ దానికెక్కడ డబ్బు పంపనే? హవ్వ!" అన్నది.

"నీకింత తిండి పెట్టలేమంటావా ఏమిటీ? లేక మేం హోటలు నడుపుతున్నామని నీ ఉద్దేశమా?" అన్నది నా భార్య రెచ్చిపోయి.

"చూశావా, చూశావా? నే నని మాటలు కూడా ఎట్లా కల్పిస్తోందో?" అన్నది మా అత్తగారు అశరీర ధర్మసాక్షితో.

"డబ్బుకూ, తిండికీ ముడిపెట్టింది నువ్వా, నేనా?"

మా అత్తగారు విషయం మార్చేసి "పోవాలనుకుంటే మాత్రం చెంబుగాణ్నీ, వట్టి ముండనూ వదిలి ఎట్లా ఉండనే?" అన్నది.

ఇక్కడ రెండు విషయాలు స్పష్టం చెయ్యాలి. మా అత్తగారు తన డబ్బు మేం తింటున్నామని మనస్ఫూర్తిగా నమ్మిందేమోగాని, నే నేనాడూ అనుకోలేదు. ఆ డబ్బు ఆవిడ చేతి మీదుగానే ఖర్చయేది. ఒకసారి నగలు కొనేది – (నాకు పనికివచ్చే ధోవతులు గాని, పాంటు, షర్టు గుడ్డలు గాని ఏనాడూ కొనలేదు, ఒక్కసారి కొన్నా నేనావిడ రుణాన పోయినట్టు బాధపడి ఉండేవాణ్ణి). ప్రతి నాటకానికీ, సినిమాకూ బయలుదేరేది. ఇరుగు పొరుగువాళ్ళకు అప్పులిచ్చేది. ఏమేమిటో చేసేది. నిజంగా ఆవిడ ఖర్చు ఆవిడ భరించుతుంటే ఆవిడ ఉన్నందుకు నాకు అదనపు ఖర్చు కానవసరం లేదు. కాని అవుతూ వచ్చింది.

"మీ అమ్మ ఒక్కతేగదా వచ్చింది. మన ఇంటి ఖర్చు దాదాపు రెట్టింపయిందేమి?" అని నేను మా ఆవిణ్ణి అడిగితే "అడక్కండి, రోజూ పిండి వంటలు చేస్తానంటుంది. నూనె, నెయ్యీ మంచినీళ్ళలాగా వాడేస్తుంది. ఎక్కడ అడ్డుపడనూ! అప్పడాలు కాల్చరాదట, వేయించాలట. అప్పటికీ ఏదోవంక చెప్పి అడ్డుపడుతూనే ఉన్నాను. నాకు మతిపోతున్నది. ఆవిడతో రోజుకు తొంభై అబద్ధాలాడేస్తున్నాను" అన్నది.

ఇక రెండవ సంగతి– మా పిల్లలంటే ఆవిడకు ముద్దు. నేను నమ్మను. వాళ్ళు మా అత్తగారిని చాలా అసహ్యమైన మాటలన్నీ అంటారు. మరీ మా తలోదరి నోటికి హద్దూ పద్దూ లేదు. దానికి మేం బారసాల చేసి పేరంటూ పెట్టలేదు. అది అందరినీ తన

పొట్టతో కొలుస్తుంది. దానికి మూడు చాక్లెట్లిచ్చిన వాళ్ళకన్నా నాలుగిచ్చిన వాళ్ళు ఎక్కువ మంచివాళ్ళు. తాను తినేది అటుకులైనా సరే ఓపిగ్గా కూచుని లెక్కపెట్టి, కుర్రాడికి కూడా లెక్కపెడతానంటుంది. చూసి చూసి దానికి తలోదరి అని పేరు పెట్టాను. "తలోదరి ఏమిటి?" అని మా ఆవిడ అడిగితే "దాని తలలో ఉదరం ఉందో, ఉదరంలో తల ఉందో ఇంకా తేలలేదు గాని, అది తలోదరి మటుకు అవును" అన్నాను.

మా అత్తగారు మొట్టమొదటిసారి దాన్ని నెలల పిల్లగా చూసి, "దీనికేం పేరు పెట్టారే?" అని అడిగితే మా ఆవిడ 'నీపేరే పెట్టాం' అనేసింది. ఆవిడ నమ్మింది.

కాని మేం దాన్ని "తలోదరీ", "తలా", "ఉదరం" అని పిలుస్తుంటే పిల్ల పలకటం చూసి ఆవిడ "నా పేరు పెట్టామన్నారూ?" అన్నది.

"అది ముద్దుపేరులే" అన్నది మా ఆవిడ.

పిల్లకు తన పేరే పెట్టుకున్నామనే నమ్మకంతో ఆవిడ మా తలోదరిని కొంతకాలం జాస్తి మమకారంతో చూసింది. కాని ఆ మమకారం దక్కలేదు.

"నీ పేరు సుభద్రే! నా పేరూ అదే. నన్ను చిన్నప్పుడు సుబ్బూ అని పిలిచేవాళ్ళు, నువు కూడా అట్లా పిలిస్తేగాని పలక్కు" అన్నదావిడ.

మా పిల్లలిద్దరు కొత్తరకం పిప్పరమెంటును చప్పరించినట్టు "సుబ్బు" అనే మాటను చాలాసార్లు ఉచ్చరించి చూసుకుని, "హె హె హే, సుబ్బు, చుప్పు, సుబ్బు సుబ్బు బుబ్బు బుబ్బుబ్బు, బ్బు బ్బు!" అని ఆట మొదలుపెట్టారు.

ఈ ఆట కొంచెంసేపు ఆడాక వాళ్ళు కోతులల్లే ఒకరి నొకరు అనుకరిస్తూ ఆవిడ నెత్తిన చెయ్యిపెట్టి రుద్దుతూ, "సుబ్బూ ఓ సుబ్బూ!" అని పిలుస్తూ కిలకిలా నవ్వారు.

"చాల్లే ఊరుకోండి! మీకు చిన్నంతరం పెద్దంతరం లేదు" అని ఆవిడ వాళ్ళను కసిరింది. వాళ్ళావిడ ఆగ్రహాన్ని లక్ష్యపెట్టలేదు. మొత్తంమీద ఆవిడ వాళ్ళ గౌరవాన్ని సంపాదించలేకపోయింది. ఏ పత్రికలో ఏ ముసలమ్మ బొమ్మ కనిపించినా, "అచ్చు అమ్మమ్మే" అనేవాళ్ళు.

"అమ్మమ్మా! నీకు సినిమాలంటే అంత ఇష్టమైతే సినిమాల్లో వేషం వెయ్యరాదూ?" అనేవాళ్ళు.

మా ఆవిడే పిల్లల్ని మందలించేది, బెదిరించేది కూడా.

"ఎందుకు వాళ్ళను తిట్టిపోస్తావు?" అన్నాను.

"వాళ్ళావిణ్ని నోటికొచ్చిన మాటల్లా అంటున్నారు. పెద్దవాళ్ళం మనం అనిపిస్తున్నామనుకుంటుందేమోనని నా భయం."

"అనుకోనీ. అనుకుంటే మన దగ్గిర ఉండకుండా వెళ్ళిపోతుందనా నీ భయం?"

"ఆవిణ్ని పంపాలంటే ఇదా పద్ధతి? పిల్లల దగ్గిర లొల్లి అయింది. వాళ్ళు చెడిపోతున్నారని కూడా నాకు భయమే. చెప్పొద్దూ? శంభుగాడు మరీ పెచ్చు మీరిపోతున్నాడు."

"అవును వాణ్ణి ఆవిడ చుడి బూ, వెండి చెంబూ అని వైన వైనాలుగా పిలుస్తున్నది. వాడు పోటీపడి ఆవిణ్ణి కూడా వైన వైనాలుగా పిలుస్తున్నాడు!"

"ఎక్కడిపీడ వచ్చిపడిందండీ?"

❁ ❁ ❁ ❁ ❁

మా పిల్లల్ని నేను అదుపు చెయ్యదలచలేదు. మా ఆవిడ చెయ్యలేక పోయింది. కాని వాళ్ళను నిగ్రహించే ఉపాయం మా అత్తగారే కనిపెట్టింది.

ఆవిడ వాళ్ళకు నీతికథలు చెప్పనారంభించింది. ఒక విధంగా ఆవిడది క్లాసికల్ పద్ధతి. నీతి కథలన్నవి ఒక్కొక్క సందర్భాన్ని పురస్కరించుకుని పుట్టాయి. వాటిలో ఉండే నీతిని ఆధారం చేసుకుని ఎవరో ఒకరు తమ ప్రవర్తనను సరిదిద్దుకున్నారు. ఆ తరువాత వాటిని మనం పుస్తకాలలో చదువుకోటం సందర్భం, శుద్ధి లేకుండా జరిగింది. దర్జీవాడి కొడుక్కు మూడో తరగతిలో మిత్రభేదం చెప్పితే ఏమంటాడు? నీతి కథలను సందర్భోచితంగా చెప్పటమే సరి అయిన పద్ధతి అని నా నమ్మకం.

మా అత్తగారు ఆ పద్ధతి అవలంబించింది. ఆవిడ వాటిని కేవలమూ ఆత్మరక్షణార్థం వినియోగించుకున్నది. పాత కథలో సందర్భోచితంగా ఉండే వాటినే చెప్పేది. సందర్భానికి సరిపడే కథ లేనప్పుడావిడ కొత్తవాటిని సృష్టించి చెప్పేది...

"ఒక మంచి కథ చెప్పు అమ్మమ్మా" అన్నాడు శంభు.

"ఒక మంచి కథ చెప్పు, సుబ్బమ్మా!" అన్నది తలోదరి.

"ఇవాళ ఒక మంచి కథ చెబుతానర్రా" అన్నది మా అత్తగారు. కథ చెప్పాలన్న బుద్ధి తానంతట తనకే కలిగినట్టుగా, "అనగనంగా ఒక రాజుకొక కూతురుండేది."

"దాని పేరు తలోదరేనా?" అన్నది తలోదరి.

"ఏమో ఏం పేరో వినండి. దాని తల్లి కాస్త చచ్చిపోయింది. అందుచేత రాజు రెండో పెళ్ళాం దాన్ని పెంచింది. రెండో పెళ్ళానికి చాలామంది పిల్లలుండే వాళ్ళు, వాళ్ళందరు ఈ తల్లిలేని పిల్లని ఏడిపించేవారు."

"వాళ్ళందరికన్నా ఇది పెద్దదిగా? ఎట్లా ఏడిపించేవాళ్ళూ?" అన్నాడు శంభుగాడు.

"పెద్దదని నేనన్నా నేమిటి? చెప్పింది వినక అన్నీ ఊహించుకుంటావేంరా?"

"రెండో పెళ్ళాం పిల్లలంటివిగా, అమ్మమ్మా! మనింటి వెనక రామయ్య పెళ్ళాం,

రెండో పెళ్ళి పెళ్లాం. రామయ్యకు మొదటి పెళ్ళాం కూతురు రెండో పెళ్ళాంకన్న పెద్దది. మేం చూశాం కూడా."

మా అత్తగారు చిక్కులోపడి, "రాజుగారు ఇద్దరు పెళ్ళాలనీ ఒకసారే చేసుకున్నాడు" అన్నది.

"అట్లా చేసుకుంటే జైల్లో పెడతారటమ్మమ్మా! అమ్మ చెప్పింది."

"రాజును ఎవరు జైల్లో పెడతార్రా? రాజులేదన్నా చెయ్యొచ్చు. కథ వినండి. పాపం, తల్లిలేని పిల్లని సవిత్తల్లీ, సవితి అన్నలూ, అక్కలూ నానా కష్టాలూ పెట్టేవాళ్ళు. పనంతా చేయించేవాళ్ళు. మూకుట్లో చాలీచాలకుండా పాసిన అన్నం పెట్టేవాళ్ళు."

"ఏం? రాజుగారికి డబ్బులేదా?"

"రాజుగారింట్లో కూడా మూకుళ్ళుంటాయా?"

"మనింట్లో మిగిలిన అన్నం పనిమనిషిక్కూడా వెయ్యమే."

మా అత్తగారు ఈ ప్రశ్నలకు తట్టుకోలేక, "మీరు కథ వింటారా? నన్నేదన్నా పని చూసుకోమంటారా?" అన్నది.

"వింటాం, వింటాం! చెప్పు, చెప్పు!"

మా అత్తగారు పోయిన ఉత్సాహాన్ని మళ్ళీ తెచ్చుకుంటూ, "అప్పుడేమయిందంటే పాపం, ఆ తల్లిలేని పిల్లకు ఒకనాడు చచ్చిపోయిన తల్లి కల్లో కనిపించి, 'అమ్మా విను! నీ సవిత్తల్లీ, అక్కలూ, అన్నలూ సరిగ్గా చూసేట్టు నే చేస్తాను. నీ నోట మంచి మాట వచ్చినప్పుడల్లా ఓ ముత్యం రాలుతుంది. ఆ తరవాత నువు సుఖంగా ఉంటావు' అని చెప్పింది" అని ప్రారంభించింది.

నేను ఆలోచనలన్నీ కట్టిపెట్టి ఆవిడ చెప్పే కథ వినసాగాను. కథ చప్పున చూడటానికి పాతదల్లే ఉన్నా అందులో ఏదో కొత్త అంశం ఉంది. అది నవ్వితే నవరత్నాలు కథకాదు. తనను ఏడిపించేవాళ్లు పాడు పనిచేసినా, పాడు మాటలన్నా అనాథ పిల్ల వాళ్ళకు హితబోధ చేస్తుంది. ఆమె నోటినుంచి హితం వచ్చినప్పుడల్లా నోటినుంచి ఒక పెద్ద ముత్యం రాలుతుంది. వాటిని దురాశాపరులైన సవిత్తల్లీ ఆవిడ పిల్లలూ ఏరుకుంటూ ఉంటారు.

బహుశా మా అత్తగారి ఉద్దేశం మా పిల్లలకు మంచి మాటలే అనడం నేర్పాలని అయి ఉంటుంది. కాని కథ పూర్తి అయే లోపలనే ఎదుటింటి అంబుజం బయటినుంచి "మామి" అని పిలిచింది. వెంటనే మా అత్తగారు కథను మధ్యలో వదిలేసి బయటికి వెళ్ళింది. మా చుట్టుపక్కలవాళ్ళూ, మా ఇంటికి వచ్చేవాళ్ళూ మా అత్తగారి కంటపడిగాని మా ఆవిడ కంటపడటానికి లేదు. అదీ పరిస్థితి. ఎప్పుడన్నా దారితప్పి ఆవిడకి

తెలియనివాళ్ళు వచ్చి, మా ఆవిడతో మాట్లాడి వెళితే, వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలన్నీ తల్లికి చెప్పకుండా ఆవిడ ఇంకే పనీ చేసుకోవటానికి లేదు.

"ఇంటి కెవరొచ్చినా ముందు తాను పరుగెత్తుతుంది" అన్నది తలోదరి.

"మన గూర్ఖా?" అన్నాడు శంభుగాడు.

"కథ పూర్తి చెయ్యకుండా వెళ్ళింది చూడు. నాన్నా, నీకీ కథ వచ్చునా? తరువాత ఏమయింది, నాన్నా?" అన్నది తలోదరి, శంభుగాణ్ని వెంటబెట్టుకుని నా దగ్గరికొచ్చి.

"ఏమవుతుందీ? ఆ తల్లిలేని పిల్ల మంచి సలహా చెప్పినప్పుడల్లా దాని నోట ముత్యం రాలుతుంది కదూ? ఆ ముత్యాలకోసం ఆశపడి దాని సవిత్తల్లీ, ఆవిడ పిల్లలూ అస్తమానమూ ఏదో పాడు మాట లనేవాళ్ళు. వాళ్ళు పాడు మాటలన్నప్పుడూ పాడు పనులు చేసినప్పుడూ తల్లిలేని పిల్ల, 'అలా అనకూడదు' అనేది. జంతువుల్ని పట్టుకుని చావగొట్టేవాళ్లు. 'అలా జంతుహింస చెయ్యగూడదు' అనేది. ముత్యం రాలేది. దేవుణ్ణి 'లంజాకొడుకు, లండీ కొడుకు' అని తిట్టేవాళ్ళు. 'దేవుణ్ణి అలా తిట్టకూడదు' అనేది. ముత్యం రాలేది. ఆ పిల్లమూలంగా వాళ్లు అన్నీ పాపిష్టి పనులే చేసి లక్షలూ, కోట్లూ ముత్యాలు సంపాదించుకున్నారు. చివరకు అందరూ యమధర్మరాజు దగ్గిరికి వెళ్ళినప్పుడు యమధర్మరాజు పాపిష్టి పనులన్నీ చేసినవాళ్ళను స్వర్గానికి పంపించి, మంచి నీతులు చెప్పిన పిల్లను రౌరవ నరకంలో లక్ష ఏళ్ళు కాలమన్నాడు" అని కథ ముగించాను.

అమ్మమ్మ కథ పూర్తిచేసే ఉత్సాహంలో నేను గమనించనేలేదు. ఆవిడ అంబుజాన్ని అప్పుడే పంపేసి తిరిగి వచ్చి నేను పూర్తిచేసిన కథ వినసే విన్నది. కథ పూర్తి అయాక పిల్లలు "హే హే హే రావురావు నరకం! లక్షేళ్లు!" అని చాలా ఆనందించారు.

ఆ రోజే మా అత్తగారు తనకు బొంబాయి వెళ్ళాలని ఉన్నట్టు నా భార్యతో అన్నదిట. మా ఆవిడ కావాలని అన్నదో యథాలాపంగా అన్నదోగాని, "ఇప్పుడేం పోతావులెస్తూ" అన్నదిట. తరవాత నాలుగైదు రోజులకే ఆవిడ బొంబాయి వెళ్ళింది. వెళ్ళి నెలదాటింది. ఇంతవరకు ఒక ఉత్తరం ముక్కన్నా రాయలేదు.

ముద్రణ: ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, ఏప్రిల్ 1967